సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 27 । మే । 2023



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు
ఇటీవల ఉపాధ్యాయ నియామకాలు పొందిన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 10లో



ఆడ శిశువు విక్రయం!
మూడో కాన్పులో కూడా ఆడపిల్లే పుట్టడంతో మధ్యవర్తి ద్వారా విక్రయించిన ఘటన నూజివీడు మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. 10లో

కోలుకుంటున్న అమృత
తాడేపల్లిగూడెంలో రైలు కింద పడి కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో తీవ్రంగా గాయపడిన కుమార్తె అమృత విజయవాడలో కోలుకుంటోంది.



10లో

న్యూస్‌రీల్

రీ సర్వే డేటా సెంటర్ ప్రారంభం



డేటా సెంటర్‌ను పరిశీలిస్తున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో రీ సర్వే డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. 15 రోజుల్లోపు మౌలిక వసతులు పూర్తిగా కల్పించి డేటా ప్రాసెసింగ్ పనులు మొదలు పెట్టాలని ఆయన ఆదేశించారు. రీ సర్వే రెండో దశ పనులు వేగవంతం చేయడానికి సువిశాలమైన కార్యాలయాన్ని కేటాయించామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, కలెక్టరేట్ ఏఓ వై.దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పేరిట వసూళ్లకు యత్నం

భీమవరం (ప్రకాశంచౌక్): దినేష్‌రెడ్డి అనే వ్యక్తి తాను భీమవరం మున్సిపల్ కమిషనర్ అని చెప్పి వ్యాపారస్తులకు ఫోన్లు చేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజు పెండింగ్ ఉన్నాయని వెంటనే చెల్లించాలని తాను పంపే క్యూ ఆర్ కోడ్ ద్వారా సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేయడం రికార్డయిన వాయిస్‌లు భీమవరంలో కలకలం రేపాయి. దీనిపై భీమవరం మున్సిపల్ ఎస్.శివరామకృష్ణ మాట్లాడుతూ దినేష్‌రెడ్డి అనే వ్యక్తి ఫేక్ అని అలాంటి ఫోన్లను నమ్మరాదని, ట్రేడ్ లైసెన్స్‌కు గాని, ఇతర ఏ ఫీజులైనా మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్ల ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. నకిలీ కమిషనర్ వ్యవహారంపై భీమవరం 35వ వార్డు సచివాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు.

28న జిల్లాస్థాయి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలోని అనసూయ చెస్ అకాడమీలో ఈనెల 28న జిల్లాస్థాయి అండర్–19 బాలుర చెస్ పోటీలు, 30న అండర్–19 బాలికల చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ శుక్రవారం తెలిపారు. బాలుర పోటీల్లో విజేతలు వచ్చేనెల 8 నుంచి నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో, బాలికల విజేతలు వచ్చేనెల 15 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 90632 24466లో సంప్రదించాలని కోరారు.

29న నిధి ఆప్‌కే నికట్

సాక్షి, భీమవరం: నిధి ఆప్ కే నికట్ డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ ఈనెల 29న పాలకొల్లు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించనున్నట్టు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను పింఛన్‌దారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఐటీఐ ప్రవేశాలు

ఉండి: జిల్లావ్యాప్తంగా ఉన్న రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శుక్రవారం తెలిపారు. వచ్చేనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నందు నమోదు చేసి ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట ఐటీఐల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అనర్హులని తెలిపారు. అలాగే అడ్మిషన్లు, రిజిస్ట్రేషన్ కోసం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో విద్యార్థులు నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 08816 297093 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఏలూరు అర్బన్ ప్రాజెక్టు నందు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్త, సహాయకురాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు అధికారి ఎ.పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాప్టిస్ట్‌పేట, పెద్దింటివారి వీధి కేంద్రాల్లో కార్యకర్త పోస్టులు, యాదవ్‌నగర్–1, కమ్మవారిషాప్–2, దొండపాడు, ఏసుపాదపురం కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. స్థానికులైన వివాహిత మహిళలు, 2022 జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. వచ్చేనెల 2న సాయంత్రం 5 గంటలలోపు స్థానిక ఏఎస్‌ఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్ వెనుక ఉన్న ఏలూరు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ప్రాజెక్టు అధికారి ఎ.పద్మావతి కోరారు.

ఆరోగ్య రక్ష.. ఆర్థిక భద్రత

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు భరోసా
- ఆరోగ్యశ్రీలో ఉచిత సేవలు
- నెలకు రూ.10 వేల వరకు పింఛన్
- డయాలసిస్ బాధితులు 343 మంది. వైద్య పెన్షనర్లు 2,434 మందికి మేలు



భీమవరం వర్మ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్న బాధితులు

భీమవరం (ప్రకాశంచౌక్): అనారోగ్యం పాలై ఆపదలో ఉన్నవారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాలుగా ఆదుకుంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా ప్రతినెలా ఆర్థిక సాయం అందించి ఆదుకుంటోంది. పక్షవాతం, డయాలసిస్, కిడ్నీ మార్పిడి, తలసేమియా తదితర బాధితులకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు నెలకు పింఛన్ అందిస్తోంది. ప్రతినెలా బాధితుల వద్దకే వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్ అందిస్తున్నారు. కదల్లేని స్థితిలో, మంచంపై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వ పింఛన్ భరోసాగా నిలుస్తోంది. ఇది వారి పోషణ, కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుంది. గతంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు సరైన వైద్యం, పింఛన్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటువంటి వారికి వైఎస్ జగన్ సర్కారు అన్నిరకాలుగా అండగా నిలుస్తోంది.

ఉచితంగా వైద్యం

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు ప్రభుత్వం పెన్షన్ అందించడంతోపాటు ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్య సేవలు అందించి వారి ప్రాణాలను నిలబెడుతోంది. డయాలసిస్ పేషెంట్లకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వడంతో క్రమం తప్పకుండా ఉచితంగా డయాలసిస్ చేయిస్తున్నారు. అలాగే తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా వంటి వ్యాధులకు సైతం వెద్య సేవలు అందిస్తూ రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నారు.

క్షతగాత్రులకు సైతం.. ప్రమాద బాధితులకు వైద్య సేవలు అందించి రూ.3 వేల పెన్షన్ అందిస్తున్నారు. కిడ్నీ దెబ్బతిన్న వారికి కిడ్నీ మార్పు చేసి రూ.10 వేలు పెన్షన్ అందిస్తున్నారు.

పింఛన్ పొందుతున్న వ్యాధిగ్రస్తులు

నెలకు రూ.10 వేల చొప్పున..		నెలకు రూ.5 వేల చొప్పున..		నెలకు రూ. 3 వేల చొప్పున..
వ్యాధి	బాధితులు	వ్యాధి	బాధితులు	పక్షవాత బాధితులు
డయాలసిస్	343	ఎలిఫెంటియాసిస్	90	1,536
తలసేమియా	44	కండరాల సమస్య	606	
సికిల్‌సెల్	10	కిడ్నీ, కాలేయ, గుండె మార్పిడి	50	
హిమోఫీలియా	98			

మూడేళ్లుగా ఉచితంగా వైద్యం



నాకు తణుకు ప్రభుత్వాస్పత్రిలో మూడేళ్లుగా ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. నెలకు రూ.10 వేల చొప్పున పెన్షన్ కూడా అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డయాలసిస్ బాధితులకు అండగా నిలిచి ఆరోగ్యశ్రీలో ఉచితంగా డయాలసిస్ చేయించడంతో పాటు పెన్షన్ అందించడం గొప్ప మానవ సేవగా భావిస్తున్నాను. నా ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్న ఆయనకు కృతజ్ఞతలు.

– వి.సత్యవాణి, పెనుగొండ

నెలకు రూ.1.32 కోట్లు



జిల్లాలో 2,434 మందికి అన్ని రకాల మెడికల్ పెన్షన్లు అందిస్తున్నాం. ఇందుకోసం నెలకు రూ.1.32 కోట్లు ఖర్చు చేస్తున్నాం. డయాలసిస్ రోగులతో పాటు తలసేమియా, ఇతర వ్యాధులకు వైద్యంతో పాటు పెన్షన్ కూడా ప్రభుత్వం అందజేస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల బారినపడినవారు ప్రభుత్వ పెన్షన్ కోసం స్థానిక సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకుంటే వైద్యులు పరీక్షించిన అనంతరం పెన్షన్ మంజూరు చేస్తారు.

– డి.మహేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ, భీమవరం

గ్రామస్థాయిలో అందుబాటులోకి వైద్యం



నవాబుపాలెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం నవాబుపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఇక్కడ భవనాలను నాణ్యంగా నిర్మించారని, గ్రామంలోనే 24 గంటలు వైద్యం అందించేందుకు బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినితో పాటు ఏఎన్‌ఎంను నియమించారన్నారు. రోగులకు ఉన్నత వైద్యానికి ఇక్కడి నుంచే రిఫర్ చేస్తారని, ఉచితంగా మందులు అందిస్తారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి పంట విక్రయాల వరకూ సేవలందిస్తున్నామన్నారు. ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. మాధవరం పీహెచ్‌సీ డాక్టర్ శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ ఆశాలత, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

13 పీహెచ్‌సీల్లో నూతన నిర్మాణాలు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు మరింత విస్తరించే దిశగా 13 పీహెచ్‌సీల్లో నూతన నిర్మాణాలు చేపట్టనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్స్ నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. ఆయా పీహెచ్‌సీల్లో ఆరు పడకలతో మొదటి అంతస్తు నిర్మాణాలకు రూ.1.28 కోట్లు మంజూరు చేశామన్నారు. తుందూరు, వీఆర్ గూడెం, వల్లూరు, మంచిలి, ఉండి, ఆలమూరు, యలమంచిలి, పెనుమంట్ర, పెంటపాడు, సిద్ధాంతం, మార్టేరు, తూర్పు తాళ్ల, యండగండి పీహెచ్‌సీల్లో నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులతో ఐదు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను ఒక్కొక్కటి రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తామన్నారు. నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల, యలమంచిలి మండలం దొడ్డిపట్ల, ఉండి మండలం యండగండి, పోడూరు, అత్తిలి పీహెచ్‌సీల్లో వీటిని నిర్మిస్తామన్నారు. జిల్లాకు మంజూరైన 276 హెల్త్ క్లినిక్‌లో ఇప్పటివరకు పూర్తయిన 91 హెల్త్ క్లినిక్‌లను సోమవారం నాటికి అప్పగించాలన్నారు. రూఫ్ స్థాయిలో ఉన్న 120 క్లినిక్‌ల నిర్మాణాలు సెప్టెంబర్ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. హెల్త్ క్లినిక్స్ నోడల్ అధికారి కీర్తి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కేఎస్ఎస్ శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల తనిఖీ

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి, పాలకోడేరు, గరగపర్రులో పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతులు పక్కాగా నిర్వహిస్తూ నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. బీసీ, ఎస్సీ హాస్టళ్లలో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్ ఆమె వెంట ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ వినియోగదారుల సంక్షేమమే సీజీఆర్‌ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరమ్) లక్ష్యమని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉల్లంపర్రు ఐటీఐ కళాశాలలో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వినియోగదారులు ఫోరమ్‌ను ఆశ్రయించవచ్చన్నారు. విద్యుత్ లైన్లలో మరమ్మతులు, లోఓల్టేజీ సమస్యలు వంటివి ఉంటే స్థానిక విద్యుత్ శాఖ అధికారులను ఆశ్రయించాలన్నారు. ప్రతిఒక్కరూ విద్యుత్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ఇప్పటివరకూ వివిధ కేసుల్లో వినియోగదారులకు రూ.5.20 లక్షలను నష్టపరిహారం కింద అందించామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఏ సమస్య అయినా పరిష్కారం కాకుంటే తగు ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చన్నారు. కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, ఆర్.సురేంద్రకుమార్, నరసాపురం సబ్ డివిజన్ డీఈ బళ్ల సురేష్‌కుమార్, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈలు బాబ్జీ, వీవీ సత్యనారాయణ, అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

మంత్రి పినిపే విశ్వరూప్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, చిత్రంలో ఎమ్మెల్యే ఎలీజా, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం చేపట్టిన పథకాలతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు వచ్చాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో రూ.7.55 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ ఏటా వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు కనిపిస్తోందని, ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేరే వారి సంఖ్య మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించడం ద్వారా పరిసర ప్రాంతాల్లోని గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈనెల 30న చింతలపూడిలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనేందుకు పాలిటెక్నిక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరుస్తున్నామన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే ఎలీజా, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మొక్కలను నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైస్‌చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, మహిళా శిశుసంక్షేమ రీజనల్ కో–ఆర్డినేటర్ వందనపు సాయిబాల పద్మ, చింతలపూడి ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గజరపు జానకిరెడ్డి, చింతలపూడి జెడ్పీటీసీ ఎం.నీరజ తదితరులు పాల్గొన్నారు.

కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య

పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తున్నామని మంత్రి విశ్వరూప్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా విద్యకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యా, వసతి దీవెనలు, విద్యా కానుక ద్వారా విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. నాడు–నేడులో పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పిస్తున్నామన్నారు. చింతలపూడిలో బస్ డిపో ఏర్పాటుపై ఎమ్మెల్యే ఎలీజా తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీలో 15 ఏళ్లు దాటిన కాలం చెల్లిన బస్సులను తొలగిస్తున్నామన్నారు. పాత బస్సుల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేస్తామని, ఇప్పటికే 998 బస్సుల కోసం టెండర్లు పిలిచామన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.24 కోట్లు

కామవరపుకోట: చింతలపూడి నుంచి కామవరపుకోట వరకు రోడ్డు విస్తరణ, మరమ్మతులకు రూ.24 కోట్లు కేటాయించినట్టు మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. మండలంలో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. సొసైటీ చైర్మన్ సాయిని కనకరాజు ఆహ్వానం మేరకు పెట్రోల్ బంకును సందర్శించి, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో మాట్లాడారు. అనంతరం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెంలో సొసైటీ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

లక్ష టన్నుల ఎరువులు సిద్ధం



వ్యవసాయ సలహా సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: జిల్లాలో 1.08 లక్షల టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించగా జేసీ మాట్లాడారు. ఆర్‌బీకేల ద్వారా 39 వేల టన్నుల ఎరువుల అమ్మకాలు లక్ష్యంగా నిర్ణయించి సచివాలయాలకు అనుబంధంగా ఉన్న గోడౌన్లలో అందుబాటులో ఉంచామన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లలో రూ.13.30 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలను రాయితీపై వచ్చేనెలలో అందిస్తామన్నారు. వచ్చేనెల 1న కాలువలకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించామని, శివారు ప్రాంతాలకు సైతం 10వ తేదీలోపు నీరు చేరే అవకాశం ఉందన్నారు. అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలువల్లో తూడు తొలగింపునకు ఇదే సరైన సమయమని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వచ్చేనెల 15లోపు సార్వా నారుమడులు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మొగల్తూరు మండలంలో వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, మొగల్తూరు, పాలకొల్లు, నరసాపురం పాలకోడేరు మండలాల్లో పంట, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, గణపవరం, ఆచంట మండలాల్లో సబ్సిడీపై జింకు, జిప్సం సరఫరా చేయాలని తీర్మానించారు. సలహా సంఘం సభ్యులు కొట్టు కుటుంబరావు, కలవపూడి దుర్గాప్రసాద్‌రాజు, సంఘాని వడ్డీ కాసులు, జిల్లా వ్యవసాయశాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామప్రసాద్, జిల్లా నీటి వనరుల శాఖ అధికారి పి.నాగార్జున పాల్గొన్నారు.

పోలీసుల బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏఎస్పీ భాస్కర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో పోలీసుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయిల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బందిని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఖాళీల వివరాలను ప్రదర్శించి సీనియార్టీ ఆధారంగా బదిలీలకు అవకాశం కల్పించారు. సిఫార్సులు, ఇతర అవకాశాలు ఏమీ లేకుండా పూర్తిస్థాయిలో పారదర్శకంగా కౌన్సెలింగ్ చేపట్టి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, పోలీస్ ప్రధాన కార్యాలయ ఏఓ సీహెచ్ గోపీనాథ్, ఏ–సెక్షన్ సూపరింటెండెంట్ కోటేశ్వ రరావు, అసిస్టెంట్ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు 358 మంది ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏలూరు డీఈఓ ఎస్‌వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లాలో రెండు విడతల్లో దరఖాస్తులు చేసుకుని ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు. మూడో విడతలో 358 మంది ఎంపిక కాగా 20 మంది మాత్రమే ప్రవేశాలు పొందారని, మిగిలిన వారు కూడా ఈనెల 28వ తేదీలోపు ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు.

వివాదాస్పదంగా వైద్యాధికారి తీరు

- విచారణకు కలెక్టర్ ఆదేశం
- ఘటనపై మంత్రి కారుమూరి ఆరా



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్ తీరు వివాదాస్పదంగా మారగా కలెక్టర్ పి.ప్రశాంతి విచారణకు ఆదేశించారు. ఆస్పత్రిలో పేద రోగుల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తున్న కారణంగా నలుగురు వైద్య సిబ్బందిని తొలగించి నాలుగు రోజులు గడవక ముందే సూపరింటెండెంట్ తీరుపైనా ఆరోపణలు రావడంతో కలకలం రేగింది. తణుకు 39వ వార్డుకు చెందిన సిరిమళ్ల శ్రీను అనే వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టిన ఆడియో క్లిప్పింగ్ సంచలనంగా మారింది. కడుపునొప్పితో బాధపడుతూ ఇటీవల ఆస్పత్రిలో చేరిన తన కుమార్తెకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో పరీక్షలు చేయించడంతో పాటు 24 గంటల నొప్పి అని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాదని తమ క్లినిక్‌కు వస్తే ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయిస్తానని వైద్యాధికారి అన్నట్టు శ్రీను ఆరోపించారు. ఈ క్రమంలో బాధితుడు కుమార్తెను రాజమండ్రిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్స చేయించినట్లుగా చెబుతున్నారు. ఈ విషయం తెలిసి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వైద్యాధికారి సెలవులో వెళ్లిపోయారు. ఈ సంఘటనపై కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు తణుకు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ ఆస్పత్రికి వచ్చి వైద్యవర్గాలను విచారించారు.

వైద్యాధికారిపై ఆరోపణలెన్నో..

వైద్యాధికారి తీరుపై పలు ఆరోపణలు వస్తున్నాయి. పేదరోగుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండటంతో పాటు ప్రైవేటు దుకాణంలో మందులు కొనుగోలు చేయాలని, ఆయన పంపించిన స్కానింగ్ సెంటర్‌లోనే పరీక్షలు చేయించుకోవాలని అంటారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఆయన ఉపయోగిస్తున్న కారు కూడా ఆస్పత్రి సమీపంలోని ఒక మెడికల్ షాపు యజమానిదనే ఆరోపణ కూడా ఉంది. వైద్యాధికారి తీరుతో ఆస్పత్రిలో వైద్యులు సైతం ఒకరితో ఒకరు మాట్లాడుకునే పరిస్థితి కూడా లేదని వైద్యవర్గాలు సైతం ఆరోపిస్తున్నాయి. అలాగే పలు సర్టిఫికెట్ల జారీలో కూడా సొమ్ములు డిమాండ్ చేస్తుంటారని, ప్రైవేట్ ఆస్పత్రులకు కేసులను పంపుతూ కమీషన్లు తీసుకుంటారని సమాచారం. ఇటీవల అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారికి సర్టిఫికెట్ల మంజూరులో సొమ్ములు వసూలు చేశారని, కిందిస్థాయిలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ద్వారా పైరవీలు సాగిస్తుంటారని తెలిసింది. ఇదిలా ఉండగా వైద్యాధికారి మాత్రం తనకేమీ తెలియదని, ఎవరో కావాలని ఇలా చేస్తున్నారని, ఒక కేసుకు సంబంధించి అపెండిసైటీస్‌లో సబ్ ఎక్యూర్డ్‌గా అని రిపోర్టు రావడంతో ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాదన్నట్లుగా మాత్రమే తాను చెప్పానని అంటున్నారు.

ఎంతటి వారైనా ఉపేక్షించం



ఆస్పత్రిలో సొమ్ములు డిమాండ్ చేసే సిబ్బందిపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే నలుగురు వైద్య సిబ్బందిని విధుల నుంచి తప్పించారు. ఆస్పత్రికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ అహర్నిశలూ పేదలకు మంచి వైద్యం అందించాలనే లక్ష్యంతో మంత్రి కారుమూరి పనిచేస్తున్నారు. అవినీతికి పాల్పడే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించమని మంత్రి కారుమూరి చెప్పారు.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

క్లుప్తంగా

దివ్యాంగుల క్రికెట్ పోటీలు ప్రారంభం



సాక్షి, భీమవరం: రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో డాక్టర్ కారుమూరి దివ్యాంగుల ఇంటర్ జోనల్ క్రికెట్ మూడు రోజుల టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. పోటీలను సంఘం రాష్ట్ర కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ, డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోర్ కమిటీ సభ్యుడు ఎస్ మధుసూదన్ నాయక్ ప్రారంభించి మాట్లాడారు. టోర్నమెంట్లో 13 జిల్లాల నుంచి సౌత్ జోన్, నార్త్ జోన్, సెంట్రల్ జోన్, కారుమూరి లెవెల్స్ జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. 28వ తేదీన ఫైనల్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వెస్ట్ గోదావరి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వీవీఎస్ఎం శ్రీనివాస్‌రాజు, బోడపాటి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన కొమ్ము ఆనందరావు (42) శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామంలోని గంటిపాడు రోడ్డులో ఉన్న తోటలోని స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్ తెగి తోట ఫెన్సింగ్‌పై పడింది. ఇది గమనించని ఆనందరావు తోటలో మోటారు ఆన్ చేయడానికి వెళ్లి ఫెన్సింగ్ తీగను పట్టుకోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆనందరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

మళ్లీ ఆడపిల్ల పుట్టిందని.. అమ్మేశారు !

- పెంచుకుంటామంటే ఇచ్చామంటున్న దంపతులు
- శిశువును తీసుకున్న దువ్వకు చెందిన దంపతులు



తన బిడ్డ కావాలని కోరుతున్న కన్నతల్లి

నూజివీడు: మూడో కాన్పులో కూడా ఆడపిల్లే పుట్టడంతో ఏం చేయాలో తెలియక ఆడ శిశువును వేరొకరికి మధ్యవర్తి ద్వారా విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం ఓగిరాల తండాకు చెందిన వడిత్యా మూర్తి, వసుంధర దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూర్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతేడాది నవంబరులో వసుంధరకు మూడో కాన్పులో కూడా స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆడపిల్ల జన్మించింది. మూడు రోజుల అనంతరం మధ్యవర్తి ద్వారా తణుకు సమీపంలోని దువ్వకు చెందిన పిల్లలు లేని దంపతులకు ఆడపిల్లను తండ్రి మూర్తి ఇచ్చేశాడు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన దగ్గర నుంచి తన కుమార్తె కోసం తల్లి వసుంధర మనోవ్యధకు గురై భర్తను మన కూతురును తీసుకురమ్మంటూ రోజూ అడుగుతోంది. ఈ క్రమంలో ఈ విషయం ఆనోటా ఈనోటా పడి చైల్డ్‌లైన్ వారి దృష్టికి చేరింది. దీంతో వారు ఐసీడీఎస్ అధికారులకు ఈ నెల 17న సమాచారమిచ్చి విచారించమని చెప్పగా, నూజివీడు సీడీపీఓ ఎస్వై నూరాణి విచారించి నివేదికను చైల్డ్ లైన్ నిర్వాహకులకు ఈ నెల 18న పంపారు. ఈ విషయంపై అదేరోజు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చైల్డ్‌లైన్ వారు ఏలూరులోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి తెలపగా, వారు శిశువుకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పెంచుకుంటున్న తల్లిదండ్రులను పిలిపించి విచారించారు. అనంతరం శిశువును నాలుగు రోజుల క్రితమే స్వాధీనం చేసుకొని శిశుగృహంలో ఉంచారు. పూర్తిస్థాయిలో విచారించిన తరువాత శిశువును ఎవరికి ఇవ్వాలి, లేదా ప్రభుత్వ సంరక్షణలో ఉంచాలా అనే విషయాన్ని నిర్ణయించనున్నారు. ఇటు పోలీసుల విచారణలో గాని, అటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్వహించిన విచారణలో గాని తాము బిడ్డను విక్రయించలేదని, పిల్లలు లేరని పెంచుకుంటామంటే ఇచ్చామని చెబుతున్నారు.

అమ్మినవారిపైన, కొన్నవారిపైన చర్యలు తీసుకుంటాం



శిశువులను అమ్మడం, కొనడం చట్టప్రకారం నేరం. ఈ కేసును సమగ్రంగా విచారిస్తున్నాం. విచారణలో తేలిన అంశాలను బట్టి అమ్మినవారిపైన, కొన్నవారిపైన చర్యలు తీసుకుంటాం.

– ఈదే అశోక్‌కుమార్ గౌడ్, డీఎస్పీ, నూజివీడు

విద్యుత్ కొరత లేదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విద్యుత్ కొరత లేదని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పీ.సాల్మన్ రాజు శుక్రవారం తెలిపారు. అధిక లోడుతో 220 కేవీ ఉండి ఈహెచ్‌టీ సబ్ స్టేషన్‌లో మూడో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ అవుతోందని, ఉండి ఈహెచ్‌టీ సబ్ స్టేషన్ నెట్‌వర్క్‌లో మార్పుల వల్ల గణపవరం, నిడమర్రు, ఉండి, భీమవరం, పాలకోడేరు, కాళ్ల, ఆకువీడు మండలాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయన్నారు. వేమగిరి–దువ్వ 220 కేవీ ఫీడర్ ఓవర్‌లోడ్ అవ్వడం వల్ల పిప్పర, కాశిపాడు, అత్తిలి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం కొరత లేదని తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని 24 గంటలు పర్యవేక్షించేందుకు లోడ్ మానిటరింగ్ సెల్‌ను ఏలూరు సర్కిల్ కార్యాలయంతో పాటు ఆరు డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

ఉద్యోగ కల్పనకు కట్టుబడిన సీఎం జగన్



ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని, అందుకు తామే ప్రత్యక్ష ఉదాహరణ అని 1998 డీఎస్సీ అభ్యర్థులు పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యాయులుగా నియామకాలు పొంది, దూబచర్ల డైట్ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా 1998 డీఎస్సీ అభ్యర్థులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ 1998వ సంవత్సరంలో నాటి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించినా తమకు ఉద్యోగాలివ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. సీఎం జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని తమకు ఉద్యోగాలిచ్చి ఆదుకున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. 25 ఏళ్లుగా తాము అనుభవించిన నరకం నుంచి సీఎం జగన్ తమకు విముక్తి ప్రసాదించారని వివరించారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పులను ముఖ్యమంత్రి సరిదిద్దుతూ ఆదర్శప్రాయంగా పని చేస్తున్నారని తెలిపారు. ఇక ప్రభుత్వ ఉద్యోగం రాదని ఆశలు వదులుకుంటున్న సమయంలో ముఖ్యమంత్రి చొరవతోనే ప్రభుత్వ ఉపాధ్యాయులు కావాలనుకునే తమ కల సాకారమయిందని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి తమ కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు చింతమనేని శ్రీనివాస్, కె.అమరావతి, ఎం.మరియమ్మ, కె.స్వామిదాసు, కె.సువర్ణరాజు, ఎన్ కిషోర్‌బాబు, వి.భూషణ్ రాజు, టి.పాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో దాడి



అమీనాబేగంను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : భార్యపై అనుమానంతో కత్తెరతో హత్యాయత్నం చేసిన భర్త ఉదంతమిది. భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం పట్టణానికి చెందిన షేక్ నాగూర్‌సాహెబ్‌కు పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన షేక్ లాలాసాహెబ్ కుమార్తె అమీనాబేగంతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా నాగూర్‌సాహెబ్ భార్యను అనుమానించడం, చిత్రహింసలు చేస్తుండడంతో ఆరు నెలల కిత్రం పుట్టింటికి వెళ్లిపోయింది. ఐతే శుక్రవారం పట్టణంలోని రంగాబజార్ ప్రాంతంలోని టైలరింగ్ షాపులో పనిచేస్తున్న అమీనాబేగం వద్దకు వచ్చిన నాగూర్‌సాహెబ్ ఆమెతో గొడవపడి కత్తెరతో గాయపర్చాడు. బాధితురాలిని చికిత్సకోసం ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లాలాసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

కొబ్బరిచెట్టుపై పిడుగు



తాడేపల్లిగూడెం: పట్టణంలోని వీకర్స్‌కాలనీలో గురువారం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. రాత్రి 11 గంటల సమయం దాటిన తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారడంతో పిడుగులు పడ్డాయి. ఇదే సమయంలో వీకర్స్‌కాలనీలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి చెట్టు కాలిపోయింది. పిడుగు శబ్దానికి ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపుచేశాయి.

డీహెచ్‌టీటీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ (డీహెచ్‌టీటీ) డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్లూమ్ అధికారి కె.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ అభ్యర్థులకు వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో 53 సీట్లు, ఏపీ అభ్యర్థులకు తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లు, ఒరిస్సాలోని బర్గర్‌లో తెలంగాణ అభ్యర్థులకు 9 సీట్లు కేటాయించినట్టు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 2023, జులై1 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీలకు 25 సంవత్సరాల వరకు వయసు ఉండాలని పేర్కొన్నారు. మూడేళ్ల డీహెచ్‌టీటీ కోర్సులో ఇంటర్ ఎంపీసీ, ఇంటర్ ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటీఐ (రెండేళ్ల కోర్సు)లో ఉత్తీర్ణులైన వారికి నేరుగా డీహెచ్‌టీటీ రెండో సంవత్సరంలో 52 సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 26లోగా సమర్పించాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 08625 295003 సెల్ నెంబర్లు 93999 36872, 98661 69908, 90102 43054లో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,269 మంది గైర్హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మూడో రోజు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 69 కేంద్రాల్లో 16,402 మంది విద్యార్థులకు 15,133 మంది పరీక్షలు రాయగా, 1,269 మంది గైర్హాజరయ్యారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గణితం–1ఏ, బోటనీ1, సివిక్స్–1, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం–2ఏ, బోటనీ–2, సివిక్స్–2 పరీక్షలు నిర్వహించారు.

ప్రథమ సంవత్సరం పరీక్షలకు: ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 3,240 మంది జనరల్ విద్యార్థులకు 2,979 మంది హాజరు కాగా 261 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 338 మందికి 284 మంది హాజరుకాగా 54 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 5,707 మంది జనరల్ విద్యార్థులకు 5,361 మంది హాజరుకాగా 346 మంది గైర్హాజరయ్యారు. 336 మంది ఒకేషనల్ విద్యార్థులకు 280 మంది హాజరు కాగా 56 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 1,526 మంది జనరల్ విద్యార్థులకు 1,439 మంది హాజరు కాగా 87 మంది గైర్హాజరయ్యారు. 188 మంది ఒకేషనల్ విద్యార్థులకు 166 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు.

ద్వితీయ సంవత్సరం పరీక్షలకు : ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 1,541 మంది జనరల్ విద్యార్థులకు 1,394 మంది హాజరుకాగా 147 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 248 మందికి 216 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 2,299 మంది జనరల్ విద్యార్థులకు 2,123 మంది హాజరు కాగా 176 మంది గైర్హాజరయ్యారు. 290 మంది ఒకేషనల్ విద్యార్థులకు 255 మంది హాజరుకాగా 35 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 595 మంది జనరల్ విద్యార్థులకు గాను 549 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు. 94 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 87 మంది హాజరు కాగా ఏగుడురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

ఆకట్టుకుంటున్న గిజిగాడి గూళ్లు



కొయ్యలగూడెంలోని పోలవరం రోడ్డులో కనబడుతున్న గిజిగాడి గూళ్లు

కొయ్యలగూడెం: వాగు, వంక, చెట్టు, పుట్టల వెంబడి కిలకిల ధ్వనులతో గిజిగాళ్లు కట్టుకునే గూళ్లను చూసి ఆనందపడని వారు ఉండరు. ఆధునిక కాలంలో రేడియేషన్ పుణ్యమా అని చిరుజీవులు కానరాకుండా పోతున్నాయి. కరోనా ప్రభావంతో రెండేళ్లుగా యాంత్రిక ప్రభావాలు తగ్గటం వల్లో, పర్యావరణంపై అవగాహన కలగడమో గాని ప్రజల వ్యవహార శైలిలో మార్పు రావడం వల్ల కిలకిలరాగాల సవ్వడిలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. కొయ్యలగూడెం – పోలవరం రోడ్డులోని కాలువ వెంబడి ఓ చెట్టుకు గిజిగాళ్ల గూళ్లు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

తపాలా ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదు



సుభాష్ రాంనాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగేంద్ర కుమార్

ఏలూరు (టూటౌన్): తపాలా శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జరుగుతోన్న అన్యాయాలపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర సర్కిల్ కార్యదర్శి డి.నాగేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలో ఖాన్ మార్కెట్ వద్ద గల లోక్ నాయక్ భవన్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు సుభాష్ రాంనాథ్‌ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించినట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సుభాష్ రాంనాథ్ మాట్లాడుతూ జూన్ నెలలో ఏపీ పోస్టల్ శాఖలో రివ్యూ మీటింగ్ నిర్వహించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నాగేంద్ర కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా ఇన్‌చార్జి ఉల్లూరి గంగాధర్, నిర్భయ వార్త సంపాదకులు భవనారి రవికుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆకివీడు: స్థానిక ఉల్వర్టన్ పేటకు చెందిన సిరపురపు నాగరాజు శుక్రవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడని ఎస్సై కె.రాజారెడ్డి తెలిపారు. భీమవరం నుంచి ఆకివీడు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో నాగరాజు తలకు, కాళ్లకు తీవ్రగాయలవ్వడంతో మృతి చెందాడని ఆయన సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

గడప గడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కోలుకుంటున్న అమృత

- విజయవాడకు తరలింపు
- కలహాలతో విషాదం



చికిత్స పొందుతున్న గుత్తి అమృత ; ఇన్‌సెట్‌లో అమృత (ఫైల్)

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో గురువారం రాత్రి తల్లీ, కుమారుడు ఆత్మహత్య కేసులో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఈ ఘటనలో కుమార్తె తీవ్రంగా గాయపడి విజయవాడలో చికిత్స పొందుతోంది. ఆర్థిక ఇబ్బందులా? లేక కుటుంబ కలహాల వల్ల ఈ తీవ్ర నిర్ణయానికి పాల్పడ్డారా? అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు త్రిభువన్ చదువులో ముందు వరుసలో ఉండేవాడు. కుటుంబం కలిసిమెలిసి ఉండేదని.. ఇంతటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కావడం లేదని చుట్టుపక్కల వారు అంటున్నారు. గురువారం రాత్రి శ్రీదేవి సత్యప్రభ (38), పిల్లలు త్రిభువన్ (18), అమృత (16)లు గురువారం రాత్రి ఆత్మహత్యా యత్నం చేసిన సంగతి తెలిసిందే.. క్షణికావేశంలో సత్యప్రభ తీసుకున్న నిర్ణయానికి బిడ్డలు తలాడించినా, ఘటనా స్థలానికి చేరుకున్నాక, ప్రాణాలు తీసుకొనే విషయంలో తటపటాయించినట్లు చెబుతున్నారు. ఇంతలో త్రిభువన్ విజయవాడ వైపునకు వెళుతున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యాయత్నం చేయగా, అక్కడికక్కడే మరణించాడు. అనంతరం సత్యప్రభ, అమృతలు కూడా తిరుమల ఎక్స్‌ప్రెస్ కిందపడి బలవన్మరణానికి ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సత్యప్రభ మృతిచెందగా.. అమృతకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబంలో మిగిలిన బిడ్డ ప్రాణం దక్కించుకొనేందుకు ఆ తండ్రి పోరాటం చేస్తున్నారు. శ్రీదేవి సత్యప్రభ, త్రిభువన్ మృతదేహాలకు ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం పూర్తయ్యింది.

విజయవాడ ఆసుపత్రిలో అమృత

రైలు ఘటనలో తీవ్రగాయాలపాలైన అమృతను గూడెంలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అమృతకు మెదడు సంబంధిత శస్త్రచికిత్స అవసరమని వైద్యులు చెప్పారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్సై హరిబాబు తెలిపారు.

క్లుప్తంగా

సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు



సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యక పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో జ్యేష్ఠమాసం సప్తమి సందర్భంగా శుక్రవారం సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు జరిగాయి. తొలుత విఘ్నేశ్వర పూజ, సూర్యనారాయణ మూల విరాట్‌కు పంచామృతాలతోను, ఫలరసాలతోను, సుగంధ ద్రవ్యాలతోను విశేషంగా అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆర్యవైశ్యులు నున్న బాల త్రిపుర సుందరరావు, పేరూరి కాశయ్య, ఆలపాటి కృష్ణకుమార్, కురిసేటి శ్యామ్‌లు పూజలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు అప్పారావుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

తెలంగాణ ఎంసెట్‌లో గూడెం విద్యార్థి ప్రతిభ



బండి చంద్ర ఈశ్వర్ కార్తీక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన బండి చంద్ర ఈశ్వర్ కార్తీక్ తెలంగాణ మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో 603వ స్టేట్ ర్యాంక్ సాధించినట్లు తండ్రి బండి శ్రీనివాసరావు వెల్లడించారు. విద్యార్థి వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. తల్లి విజయలక్ష్మి అనంతపల్లి రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కార్తీక్ మాట్లాడుతూ డాక్టర్ కోర్సు పూర్తి చేసిన అనంతరం సివిల్ సర్వీస్ పరీక్షలో విజయం సాధించడమే లక్ష్యంగా తన విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం:విద్యలో రాణించి ప్రతిభావంతులు కావాలని ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. జిల్లా పోలీస్ యూనిట్ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బంది పిల్లలకు శుక్రవారం ఆయన చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి పోలీస్ వెల్ఫేర్ ద్వారా సాయం అందచేస్తామని తెలిపారు. సుమారు 29 మంది విద్యార్థులకు రూ.2 వేల చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.వి. సుబ్బరాజు, సెబ్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, వెంకట్రావు, శ్రీకాంత్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు విజయవంతం చేయాలి

సాక్షి, భీమవరం: ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 28 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ కోస్తాంధ్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభిస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు చెప్పారు. శిక్షణాతరగతుల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు కూడళ్లలో ఏఐఎస్ఎఫ్ తోరణాలు, జెండాలతో అలంకరించారు. శిక్షణా తరగతుల్లో కోస్తా ప్రాంతానికి చెందిన 12 జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని భీమారావు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో పండంటి బిడ్డ

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో సత్ఫలితాలు
- రక్తహీనత నివారణకు దోహదం
- గర్భిణుల్లో తగ్గుతున్న పౌష్టికాహారలోపం
- నియోజకవర్గ పరిధిలో 19 వేల మందికి లబ్ధి



అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకొంటున్న గర్భిణులు, బాలింతలు

పెంటపాడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలు ఇస్తోంది. ఈ పథకం వల్ల ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పేదరికం వల్ల గర్భిణీలు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల వారికి పుట్టిన బిడ్డలు పోషణ లోపంతో బాధపడుతూ గతంలో అనేక వ్యాధుల బారిన పడేవారు. పిల్లలు సరైన ఎదుగుదలకు నోచుకోవడం లేదని గుర్తించిన ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టింది. మూడేళ్ల క్రితం వైఎస్సార్ సంపూర్ణపోషణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో ఎంతోమందికి ఉపయోగం కలుగుతోంది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్డుకు అదనంగా మరో ఆరు రకాల పోషకాహార సరుకులు అందించడంతో వారిలో రక్తహీనత తగ్గింది. తద్వారా ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు.

నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో

ఐసీడీఎస్ ప్రాజెక్టుపరిధిలో గూడెం పట్టణంలో 60 కేంద్రాలు, రూరల్ మండలంలో 80 కేంద్రాలు, పెంటపాడు మండలంలో 74 కేంద్రాలు మొత్తం 214 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు273 మంది కాగా బాలింతలు 1931 మంది, 7 నెలల నుండి 3 ఏళ్ల లోపు పిల్లలు 8,559, 3 నుండి 6 ఏళ్లలోపు పిల్లలు 6,807 మంది ఉన్నారు. వీరందరూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో ఇప్పుడు లబ్ధి పొందుతున్నారు.

సంపూర్ణ పోషణ కిట్‌ల సరఫరా:

గర్భిణులు, బాలింతలకు కిలో రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుసెనగచిక్కీ, 250 గ్రాముల ఎండి ఖర్జూరం, 3 కిలోల బియ్యం, అరకిలో నూనె, అరకిలో పప్పు, 5 లీటర్ల పాలు, 20 కోడిగుడ్లు ఇస్తున్నారు. వీటన్నింటిని డ్రై రేషన్‌గా లబ్ధిదారుల ఇంటికి పంపుతున్నారు. 7 నెలల నుంచి మూడేళ్ల వరకు చిన్నారులకు నెలకు రెండున్నర కిలోల బాలామృతం, ప్రతి రోజు 15 గ్రాముల పప్పు, 50 గ్రాముల ఆకుకూర, 100 ఎంఎల్ పాలు, కోడిగుడ్డు అందిస్తున్నారు. 3 నుండి ఆరేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం వండి పెడుతున్నారు.

మెనూ ఇలా....

సోమ, గురు వారాల్లో అన్నం కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డుకూర, 100 ఎంఎల్ పాలు, మంగళ, శుక్రవారాల్లో అన్నం, పప్పు తోటకూర కూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలు, బుధ, శని వారాల్లో అన్నం లేదా, విజిటబుల్ రైస్, లేదా పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలు అందిస్తున్నారు.

తల్లీ, బిడ్డ సంక్షేమానికి కృషి



సంపూర్ణ పోషణ పథకంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగపడుతోంది. అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ప్రతి తల్లీబిడ్డా సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం ప్రత్యేక ప్రణాళికతో మాతా, శిశుసంరక్షణకు అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించి కృషి చేస్తున్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది.

– ఉప్పులూరి వరలక్ష్మి, పెంటపాడు మండల జెడ్పీటీసీ సభ్యురాలు

250 మంది గర్భిణులపై సర్వే



మండలంలో ప్రయోగాత్మకంగా 250 మంది గర్భిణులపై సర్వే నిర్వహించాం. మూడో నెల నుంచి ప్రసవించే వరకు ప్రభుత్వం అందించే పోషణ కిట్‌తో పాటు, ఐరన్ మాత్రలు తీసుకొన్న వారిలో 9 శాతం ఉన్న హిమొగ్లోబిన్ 11 శాతానికి పెరిగింది. రక్తపోటు సాధారణంగా ఉంది. 80 శాతం మందికి సహజప్రసవాలు జరిగాయి. పుట్టిన బిడ్డ గతంలో 2 కిలోలు ఉంటే ఇప్పుడు రెండున్నర కిలోలు ఉంటున్నారు. మాతా మరణాలను అరికట్టగలిగాం

– సీహెచ్ దుర్గాభవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటపాడు మండలం

రెండు పూటల మస్టర్ రద్దుచేయాలి



కొత్తపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ సంఘం నాయకులు

ఇరగవరం: ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా రెండు పూటల మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. శుక్రవారం మండలం కొత్తపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీకి బడ్జెట్‌లో కోత పెట్టారన్నారు. అంత ప్రాధాన్యత కలిగిన చట్టానికి నిధులు తగ్గించడం సిగ్గుచేటు అన్నారు. కనీస వసతులు లేకుండా మండుటెండల సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కూలీలకు పే స్లిప్పులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కడలి సుబ్బారావు, కొప్పిశెట్టి శ్రీరామూర్తి, దొంగ కొండమ్మ , పిల్లి పద్మ, పొట్ల సత్తిబాబు, తోరం మణి, జుత్తిగ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

పెంటపాడు: మండలంలోని రాచర్ల, దర్శిపర్రు గ్రామ శివార్లలో శుక్రవారం పెంటపాడు పోలీసులు పేకాట శిబిరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 10మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.7,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి. సత్యనారాయణ తెలిపారు.

చంద్రబాబు కోసం పవన్ పనిచేయడం సిగ్గు చేటు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- నవాబుపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: చంద్రబాబు కోసం పవన్ పనిచేయడం సిగ్గు చేటని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తనకు ముఖ్యమంత్రి అయ్యేయోగ్యత లేదని స్వయంగా పవన్ కల్యాణ్ చెప్పడం ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. పవన్ ముఖ్యమంత్రి అవుతాడని ఆయన అభిమానులు, కాపు సామాజికవర్గం ఆశిస్తుంటే తనకు అంత అవకాశం లేదని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి మనమంతా పనిచేయాలని పవన్‌కల్యాణ్ చెప్పడాన్ని ఆయన అభిమానులే అసహ్యించుకుంటున్నారన్నారు. ప్రశ్నించడానికి జనసేన పార్టీని పెట్టానని చెప్పిన పవన్ కల్యాణ్ తెలుగుదేశం హయాంలో ఆ ప్రభుత్వాన్ని ఏనాడైనా నిలదీశారా ?అని ప్రశ్నించారు. పవన్ తీరుతో కాపు సామాజికవర్గం చాలా నష్టపోతుందన్నారు. కాపు సామాజికవర్గాన్ని చంద్రబాబు కోసం తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి చెప్పిన దాని కంటే ఎక్కువగా 31.50లక్షల మందికి 70 వేల ఎకరాల భూమిని కొనుగోలు చేసి జగనన్న ఇంటి స్థలాలు కింద పంపిణీ చేశారన్నారు. నాలుగేళ్ల కాలంలో 2.10లక్షల కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగనన్నకు మనమందరం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైస్ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, నార్ని రవికాంత నాగేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సొసైటీ ఛైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, పరిమి తులసీదాస్, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, పీఆర్ ఏఈ పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ మద్దుకూరి ఆశాలత, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, మండల సేవాదళ్ ఛైర్మన్ కొండుబోయిన కృపావరం, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, పెదగాడి విష్ణు, గెద్దం లక్ష్మీకుమారి, బండి శ్రీనివాసరావు, బండి సర్వేశ్వరరావు, నున్నా పీటర్, చిట్టూరి బాపన్న, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రై డే పాటించడంతో దోమల నివారణ సాధ్యం



యాగర్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వారానికి ఒక్కసారి పట్టణంలో డ్రై డే పాటించడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం యాగర్లపల్లి డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 21 నుంచి 25 వార్డుల్లో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకోవడం ద్వారా అనేక వ్యాధులను అరికట్టేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వ్యాధులు ఏ విధంగా వస్తాయో, ఎలా నివారించవచ్చో, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలినప్పుడు తప్పక ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. శానిటేషన్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని, డ్రైయిన్‌లలో వ్యర్థాలు వేయకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా హెల్త్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గృహ సందర్శనాలు చేయాలని, వ్యర్థాలు ఉంటే శానిటేషన్ సిబ్బందికి చెప్పి వాటిని తొలగించేందుకు, అవసరమైన చోట్లు నీటి నిల్వలు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట కీటక నియంత్రణలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, అంగన్‌వాడీలు, వాలంటీర్లు, శానిటేషన్ సిబ్బంది సరస్వతి, రజనికుమార్, నాగలక్ష్మి, రాజేశ్వరీ, రాజేష్, కుమారి, మోహన్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాలు బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మికులు ఉద్యమాలను బలోపేతం చేయాలని, అందరూ ఐక్యంగా పోరాడాలని సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు వెల్లడించారు. పట్టణంలోని ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయం వద్ద చల్లా చంద్రరావు అధ్యక్షతన శుక్రవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం లౌకిక విధానానికి తూట్లు పొడుస్తున్నారని, మతాలను రెచ్చగొడుతూ పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి అనుగుణంగా పరిపాలన చేయాలన్నారు. భారతదేశంలో హిందు మతం తప్ప ఏ మతం ఉండరాదని మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. అదే విధంగా ప్రభుత్వ రంగాలను కార్పొరేట్లుకు దోచిపెట్టేవిధంగా చేస్తున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కేంద్ర నిర్ణయాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, కరక వెంకట్రావు, జి.శ్రీను, తదితర కార్మిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు



అత్తిలి శాఖా గ్రంథాలయం శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం, దేశభక్తి గీతాలను ఆలపించారు. ఉపాధ్యాయిని కె కోమలి రాష్ట్ర రాజధానులను సులభంగా గుర్తు పెట్టుకునే విధంగా టెక్నిక్స్ నేర్పించారు. డ్రాయింగ్ టీచర్ అమర్ విద్యార్థులకు సులభంగా డ్రాయింగ్ వేయడంపై మెళకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో యర్రా జ్యోతిలలిత, బండి పావని, ఎం శ్రీదేవి, హెచ్‌వీఆర్ కిశోర్‌బాబు, గ్రంథపాలకుడు డి కృష్ణారావు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శుక్రవారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యర్రమిల్లి ప్రభాకర్ చేతి రాత పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రిసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ):పట్టణంలోని గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ విజ్ఞాన తరగతులు శుక్రవారం గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు. సీనియర్ సిటిజన్ దుర్గమ్మ విద్యార్థులచే మెడిటేషన్ ఏ విధంగా చేయాలో నేర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి



పట్టణంలో ధర్నా చేస్తున్న సీఐటీయు నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈఎస్ఐ పథకాన్ని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించాలని కోరుతూ సీఐటీయు తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఉపయోగపడే ఆసుపత్రి నందు సరైన సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, డాక్టర్లు, మందులు, ల్యాబ్ టెక్నిషియన్స్ వంటి సదుపాయాలు డిస్పెన్సరీలో లేకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయిలు కార్మికుల సొమ్ము ఉన్నప్పటికి వాటిని కార్మికులకు అనుకూలంగా ఉపయోగించడం లేదని ఆరోపించారు. ప్రతి జిల్లాకు ఒక 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 3ఎఫ్ యూనియన్ నాయకులు టి.గణేష్, వి.సత్యనారాయణ, కనకరాజు, ప్రసాద్‌బాబు, ధనాల దానయ ఎస్.సతీష్, పద్మ, దయామణి పాల్గొన్నారు.


సంక్షేమ రథ సారథులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న వార్డు ఇన్‌ఛార్జ్‌లు , తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు తీసుకొస్తున్న ఘనత వలంటీర్లదేనని నోడల్ అధికారి ఆర్ఎస్. ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలోనూ ప్రజలకు సేవలందించడం ప్రశంసనీయమన్నారు. వారు అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పురస్కారాలతో గౌరవిస్తుందన్నారు. ఇకపై క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రమేష్, సచివాలయ సిబ్బంది ఎ.ఇమ్రాన్, ఎ.వెంకన్నబాబు, కె.వినయ్‌కుమార్, వెంకటేష్, ఎం.వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవలు అభినందనీయం



తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వలంటీర్లు సేవలు అభినందనీయమని వార్డు ఇన్‌చార్జ్‌లు తెన్నేటి జగజ్జీవన్, నీరుకొండ పండు, మిద్దే ఆదినారాయణ, మార్నీడి వెంకన్న, దూద్ బాష, పాలూరి దొరబాబు,బొద్దు సాయిబాబాలు కొనియాడారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో 13,14,15,16,17 వార్డులకు సంబంధించి వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం మునిసిపల్ ఇంజనీర్ ఎం.మురళీ అధ్యక్షతన జరిగింది. వార్డు ఇన్‌చార్జ్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిట్లో అనేక సంక్షేమాలను అందించడం అభినందనీయమన్నారు. వృద్ధులకు తెల్లవారుజాము నుంచే పెన్షన్‌లు అందజేత గొప్ప విషయమని తెలిపారు. కోవిడ్ వంటి ప్రతికూల సమయంలో కూడా వలంటీర్లు ప్రాణాలు లెక్కచేయకుండా సేవలు అందించారని కొనియాడారు. సచివాలయాలు ద్వారా 400 సర్వీసులను ప్రజలకు అందజేసేందుకు వలంటీర్లు వారధిగా పని చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని ప్రతి పక్ష పార్టీలు చూస్తున్నాయని వారికి తప్పక గుణపాఠం చెబుతారన్నారు. వాలంటీర్స్ వందనం కార్యక్రమం ద్వారా సేవా వజ్ర, సేవా రత్నం, సేవ మిత్ర పురస్కారాలతో వాలంటీర్లును సన్మానించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఆర్ఓ రవికుమార్, ఆర్ఐ శ్రీనివాస్, సచివాలయం సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక 20 వార్డులోని వలంటీర్లకు సత్కార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఇంటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా వలంటీర్ల వ్యవస్థ పనిస్తుందని కర్రి భాస్కరరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంతఈ మురళీకృష్ణ, రాజా త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.